క్లుప్తంగా

వేంకటేశుని సన్నిధి.. భక్తుల పెన్నిధి


అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి

పెరవలి: శనివారం, ఏకాదశి కావడంతో అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామి వారికి వందలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దాతల ఆర్థిక సహాయంతో సుమారు ఆరు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు అన్న సమారాధన చేస్తున్నామన్నారు. అలాగే ప్రసాదాలు కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

హిందీ విశ్వవ్యాప్త భాష


హైస్కూల్లో హిందీ ప్రాధాన్యతపై మాట్లాడుతున్న హెచ్ఎం మాణిక్యాలరావు

ఉండ్రాజవరం: హిందీ విశ్వ వ్యాప్తమైన భాష అని, హిందీ సాహిత్యంలో ఎన్నో నైతిక విలువలు ఉన్నాయని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం కేఎస్ మాణిక్యాలరావు అన్నారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 సెప్టెంబర్ 14న హిందీ అధికారిక భాషగా గుర్తింపబడిందన్నారు. హిందీ ఉపాధ్యాయుని కరుటూరి జగన్మోహిని రాణి కూడా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను, అతిథులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐ.రాంబాబు, ఎస్.లక్ష్మీనారాయణ, బి.శ్రీనివాసరావు, ఎ.సుబ్బారావు, ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి గ్రామాల్లో స్వచ్ఛతాహీ కార్యక్రమాలు

నల్లజర్ల: స్వచ్ఛతాహీ సేవల్లో భాగంగా ఈ నెల17 నుంచి అక్టోబర్ 2 వరకూ గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ సింహాద్రి మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అలాగే స్వచ్ఛతాహీ కార్యక్రమాల అమలుపై ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో గ్రామాల్లో ర్యాలీలు, సదస్సుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్థానికుల సాయంతో శుభ్రత, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో వ్యర్థాలు పేరుకుపోయిన ప్రాంతాలను శుభ్రం చేసి, అక్కడ మొక్కలు నాటాలన్నారు. పారిశుధ్య కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం నిర్దేశిత తేదీల్లో కార్యక్రమాల నిర్వహణకు వివిధ శాఖల సమన్వయం ఎంతో ముఖ్యమన్నారు. ఈనెల 17న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో స్వచ్ఛతాహీ ప్రతిజ్ఞ నిర్వహించాలన్నారు. డ్రైన్లలో పూడికతీత, దోమల నివారణ చర్యలు, తాగునీరు, ట్యాంకుల క్లోరినేషన్, వీధి దీపాల వంటి సమస్యల పరిష్కారానికి కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో సింహాద్రి సూచించారు.

బొజ్జ గణపయ్యా... నీవైనా చూడయ్యా..!

- నిమజ్జనాల ప్రాంతంలో పొంచి ఉన్న ప్రమాదం
- పరవళ్లు తొక్కుతున్న గోదావరి
- నేడు భారీగా వినాయక విగ్రహాల నిమజ్జనం
- డివిజన్‌లో 773 గణేశ్ శిబిరాల ఏర్పాటు
- నిమజ్జనం చేయాల్సినవి మరో 421 విగ్రహాలు


కొవ్వూరులో క్రేన్‌తో గోదావరిలో నిమజ్జనం చేస్తున్న భారీ గణనాథుని విగ్రహం (ఫైల్)


కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు: తొమ్మిది రాత్రులూ భక్తుల పూజలందుకున్న గణనాథుని విగ్రహాలు ఒక్కటొక్కటిగా నిమజ్జనానికి గంగమ్మ ఒడికి తరలి వస్తున్నాయి. నిమజ్జనోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించడం లేదు. మరోపక్క వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపం భక్తులకు శాపంగా మారుతోంది. స్థానిక సంస్థలు, మత్స్య, నీటిపారుదల, రెవెన్యూ, అగ్నిమాపక శాఖలు నిమజ్జనోత్సవ ప్రాంతంలో ఏర్పాట్లపై దృష్టి సారించడం లేదు. చివరికి స్థానిక పోలీసు అధికారులే కిందామీదా పడి ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జనాల రేవుల్లో అరకొర వసతులు, ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్ల భక్తులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల నిడదవోలులో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో వినాయక విగ్రహం నిమజ్జనోత్సవంలో చాగల్లు మండలం బ్రాహ్మణగూడేనికి చెందిన పేడాడ రాజేష్ అనే యువకుడు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. భారీ విగ్రహాల నిమజ్జనానికి విధిగా క్రేన్ ఏర్పాటు చేసుకోవాలి. నిమజ్జన ప్రదేశంలో క్రేన్లు, విద్యుత్ లైటింగ్‌తో పాటు ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను కూడా సిద్ధంగా ఉంచితేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. పైగా పోలీసు అధికారులు నిర్దేశించిన జలాశయాల రేవుల్లోనే నిమజ్జనాలు చేయాలి.

డివిజన్ వ్యాప్తంగా వినాయక శిబిరాల వివరాలు

స్టేషన్ పేరు	మొత్తం విగ్రహాల సంఖ్య	నిమజ్జనం చేసిన విగ్రహాలు	చేయాల్సిన విగ్రహాల సంఖ్య
కొవ్వూరు పట్టణం	71	20	51
కొవ్వూరు రూరల్	62	13	49
తాళ్లపూడి	48	10	38
చాగల్లు	85	59	26
దేవరపల్లి	63	20	43
గోపాలపురం	75	33	42
నల్లజర్ల	81	66	15
నిడదవోలు	45	02	43
పెరవలి	110	57	53
సమిశ్రగూడెం	74	33	41
ఉండ్రాజవరం	59	39	20
మొత్తం	773	352	421

మరో 421 విగ్రహాల నిమజ్జనం

పోలీసు అధికారుల లెక్క ప్రకారం కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా భక్తులు 773 వినాయక విగ్రహాలనుప్రతిష్ఠించారు. వాటిలో ఇప్పటికే 352 విగ్రహాలను నిమజ్జనం చేయగా, మరో 421 నిమజ్జనం చేయాల్సి ఉంది. అదనంగా నిడదవోలు, కొవ్వూరు పట్టణాల అపార్ట్‌మెంట్లు, గ్రూపు హౌసుల్లోను, పలు గల్లీల్లోనూ చిన్న చిన్న విగ్రహాలను ఏర్పాటు చేశారు. వాటిని కూడా కలుపుకుంటే ఇంకా నిమజ్జనం చేయాల్సిన విగ్రహాల సంఖ్య 600కి పైమాటే.


కొవ్వూరులో గోదావరిలో దిగి గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు (ఫైల్)

గోదావరిలో వరద పరవళ్లు

చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ఆదివారం నాడు భారీఎత్తున విగ్రహాల నిమజ్జనోత్సవం చేస్తారు. అధికారులు గోదావరి నదితో పాటు పలుచోట్ల ఉన్న జలాశయాలతో కూడిన 60 నిమజ్జన ప్రదేశాలను గుర్తించారు. అయితే సగానికి పైగా గణనాథుల విగ్రహాలను గోదావరి నదిలోనే నిమజ్జనం చేస్తారు. స్థానిక గోష్పాద క్షేత్రం పవిత్రతను దృష్టిలో ఉంచుకుని ఎక్కువగా భారీ విగ్రహాలను నిమజ్జనానికి ఇక్కడికే తీసుకు వస్తారు. తీరా ఇక్కడి నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలిస్తే భయమేస్తుంది. ఇప్పటికీ వరదతో గోదావరి పరవళ్లు తొక్కుతోంది. గోష్పాద క్షేత్రం మెట్లను తాకుతూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం సాయంత్రం కూడా గోదావరిలో 8 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోంది. వరద తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అధికారులు ఇక్కడ పటిష్ట ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశాం



గోదావరిలో వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున నిమజ్జనాలకు పటిష్ట ఏర్పాట్లు చేశాం. అన్నిచోట్లా పోలీసు బందోబస్తు నియమించాం. పోలీసులు సూచించిన ప్రదేశాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలి. పెద్ద విగ్రహాలను గోష్పాద క్షేత్రంలోని నరసింహస్వామిగుడి సమీపంలో నిమజ్జనం చేయిస్తాం. ఇందుకోసం క్రేన్‌లు, 24 గంటలూ నలుగురు చొప్పున గజ ఈతగాళ్లను, రెండు స్పీడ్ బోట్లను సిద్ధం చేశాం. విగ్రహాల ఊరేగింపులో ప్రజలకు ఆటంకాలు కలగకుండా నిర్వాహకులు సహకరించాలి.

– జి.దేవకుమార్, డీఎస్పీ, కొవ్వూరు

కానరాని ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఈనెల 10న గోష్పాద క్షేత్రంలో వరద ఉధృతిని పరిశీలించారు. వినాయక విగ్రహాలు నిమజ్జనాలు చేసే ప్రాంతాన్ని వారిద్దరూ పరిశీలించి పలు సూచనలు చేశారు. అదే రోజు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవలు నిమజ్జనోత్సవ ప్రదేశాలను, ఏర్పాట్లను పరిశీలించారు. ఇంతలో గోదావరికి వరద వచ్చి తగ్గుముఖం పట్టింది. వరద తగ్గేంత వరకూ వినాయక నిమజ్జనాలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇప్పుడు వరద తగ్గి రెండు రోజులైంది. నిమజ్జనానికి అధికారులు తొలుత నిర్దేశించిన ప్రాంతంలో ఎలాంటి ఏర్పాట్లూ చేయలేదు. ప్రస్తుతం గోష్పాద క్షేత్రం అంధకారంగా ఉంది. ఇక్కడి లైట్లు పూర్తిస్థాయిలో వెలగడం లేదు.పైగా ఆదివారం అధిక సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనాలకు తరలి వచ్చే అవకాశం ఉంది. గోష్పాద క్షేత్రంలో అదనపు లైటింగ్ ఏర్పాటు చేయాలి. నిమజ్జనోత్సవాల ఊరేగింపు ముగించుకుని విగ్రహాలన్నీ పొద్దుపోయాకే నది వద్దకు చేరుకుంటాయి. మరోపక్క ఈ క్షేత్రంలో రోడ్లపై పేరుకుపోయిన బురద తొలగింపుపై కొవ్వూరు మునిసిపాలిటీ ఇంత వరకూ దృష్టి సారించనే లేదు. కేవలం ఆదివారం సాయంత్రంలోగా ఈ పనులన్నీ పూర్తి చేయడం కష్టసాధ్యం. ఏదైనా ప్రమాదం సంభవించక ముందే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి నిమజ్జనం ప్రదేశాల్లో సరైన సదుపాయాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

దేవరపల్లి: గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కె.నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఏడు సహాయరాలి పోస్టులను భర్తీ చేస్తున్నట్టు చెప్పారు. ఖాళీగా ఉన నల్లజర్ల మండలం చాదరాశికుంట కోడ్ నంబర్ 0511054 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టును జనరల్ కేటగిరీకి కేటాయించారు. అలాగే అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులు నల్లజర్ల మండలం చాదరాశికుంట (బీసీ–బి), గోపాలపురం మండలం గంగోలు (హుకుంపేట కేంద్రం– జనరల్), దేవరపల్లి మండలం యర్నగూడెం(యర్నగూడెం -5- జనరల్), నల్లజర్ల మండలం నబీపేట (కేంద్రం–1– ఎస్సీ), దేవరపల్లి మండలం గౌరీపట్నం (కేంద్రం–5– జనరల్), గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం (కేంద్రం–2 బీసీ–ఎ), నల్లజర్ల మండలం నల్లజర్ల (కేంద్రం–2– జనరల్)కు కేటాయించినట్టు ఐసీడీఎస్ పీఓ కె.నాగలక్ష్మి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ లోగా ఐసీడీఎస్ గోపాలపురంలో పూర్తి చేసిన తమ దరఖాస్తులు అందించి, రశీదు పొందాలన్నారు. 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల టెన్త్ పాసైన స్థానిక మహిళలు మాత్రమే దరఖాస్తు చేయడానికి అర్హులని ఆమె పేర్కొన్నారు.

దేవరపల్లి మాజీ సర్పంచ్ మృతి


లక్ష్మీనాంచారమ్మ (ఫైల్)

దేవరపల్లి: దేవరపల్లి మాజీ సర్పంచ్ అంబటి లక్ష్మీనాంచారమ్మ (96) శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరంలో మృతి చెందారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న లక్ష్మీనాంచారమ్మ కొద్ది రోజులుగా రాజమహేంద్రవరంలోని తన కుమారుడు అంబటి శ్రీనివాసరావు నివాస గృహంలో ఉంటూ అక్కడే ప్రాణాలు విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె పార్థివ దేహాన్ని శనివారం తెల్లవారుజామున దేవరపల్లి తీసుకువచ్చి పెద్ద కుమారుడు వీరవెంకట సత్యనారాయణ ఇంటి వద్ద ప్రజల దర్శనార్థం ఉంచారు. అనంతరం స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. 2002 నుంచి 2006 వరకూ ఆమె దేవరపల్లి పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, స్థానిక ఎంపీపీ కేవీకే దుర్గారావు, జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ డి.సువర్ణరాజు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు లక్ష్మీనాంచారమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

లోక్ అదాలత్‌లో 165 కేసుల పరిష్కారం


కేసులను పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రామకృష్ణ

నిడదవోలు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కోర్టులో 26 క్రిమినల్, సివిల్ కేసులు, 139 పెట్టీ కేసులు పరిష్కరించారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా రూ.20.70 లక్షలను పరిహారంగా కక్షిదారులకు అందజేశారు. కార్యక్రమంలో రెండో స్పెషల్ జడ్జి నక్కా అజయ్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ములగాల రవికుమార్, కోర్టు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భర్తపై అదనపు కట్నం కేసు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ శనివారం తెలిపారు. మండలంలోని పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన తాడి జ్యోతికి రామరాజుకు 2012లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఇటీవల తన భర్త రామరాజుతో పాటు వారి కుటుంబ సభ్యులు తనను కట్నం కోసం వేధిస్తున్నారంటూ బాధితురాలి జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనాలు


గోపాలపురం టాక్సీస్టాండ్ వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహం ఊరేగింపు

గోపాలపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవాలు జోరుగా సాగుతున్నాయి. గోపాలపురం టాక్సీస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శనివారం డప్పు వాయిద్యాలు, కోయ డ్యాన్స్‌లతో గ్రామ వీధుల్లో ఊరేగిస్తూ, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలంలోని కొవ్వూరుపాడు, భీమోలు, వాదాలకుంట తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను ఊరేగించి తాళ్లపూడి వద్ద గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

36,900 పలికిన లడ్డూ

గోపాలపురం టాక్సీస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మహారాజ్‌కు సమర్పించిన లడ్డూకు శనివారం వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన ముల్లంగి శ్యామ్ సుందర్ రెడ్డి రూ 36,900 కు దక్కించుకున్నారు. సోమవారం టాక్సీస్టాండ్ వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

మల్లేశ్వరంలో భారీ అన్న సమారాధన

పెరవలి: గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో మేడిచెర్ల బుజ్జి ఆధ్వర్యంలో శనివారం భారీ ఎత్తున అన్న సమారాధన జరిగింది. మల్లేశ్వరంలో పాటు కడింపాడు, పిట్టల వేమవరం, అన్నవరప్పాడు గ్రామాల నుంచి సుమారు 4 వేల మంది భక్తులు హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేగేశ్వరపురంలో ..

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం భారీఎత్తున అన్నసమారాధన చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సుమారు 3 వేల మంది భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. అలాగే ఈ గ్రామంలోని కాలువగట్టు వద్ద గల వినాయకుని ఆలయం వద్ద శుక్రవారం సుమారు 3 వేల మందికి అన్నదానం చేశారు. తాళ్లపూడిలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కూడా అన్నసమారాధన జరిగింది.

ఆకట్టుకున్న సంగీత విభావరి

చాగల్లు: గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా చాగల్లు తెలగా సంఘం కళావేదిక వద్ద శుక్రవారం రాత్రి రాక్ స్టార్ ఆర్కెస్ట్రా వారి సినీ సంగీత విభావరి నిర్వహించారు. గాయక, గాయనీమణులు పలు హుషారైన పాటలు పాడి ప్రేక్షకులను రంజింపజేశారు. సంగీత విభావరిని తిలకించడానికి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో జనం వచ్చారు. ఉత్సవ ఏర్పాట్లను కమిటీ నిర్వాహకులు గండ్రోతు సురేంద్రకుమార్ పర్యవేక్షించారు. అలాగే స్థానిక వర్తక సంఘం కళావేదికపై డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ప్రదర్శించారు. నిర్వాహకుడు గ్రంధి రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా బ్రాహ్మణగూడెంలోని జగనన్న కాలనీలో అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

20 మంది రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం


చాగల్లులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

చాగల్లు: విశ్రాంత ఉపాధ్యాయుల సేవలు ఎన్నటికీ మరువలేనివని ఎస్‌బీఐ చాగల్లు శాఖ మేనేజర్ కేపీ నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశాన్ని శనివారం స్థానిక అంబేడ్కర్ రీడింగ్ భవనంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాయుడు హాజరై మాట్లాడుతూ సెప్టెంబర్ నెల కార్యవర్గ సమావేశంలో గురుపూజోత్సవం నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అనంతరం విశ్రాంత సాంఘిక సంక్షేమాధికారి టి.సాల్మన్‌రాజు సతీమణి శాంతిసుధ జ్ఞాపకార్థంగా సంఘంలోని 20 మంది విశ్రాంత ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో దాసరి నాగేశ్వరరావు, వెత్సా గంగాధరం, కేఎస్ఎన్ మూర్తి, కె.సత్యవాణి ,బచ్చు వెంకటరత్నం, గండి దానియేలు, పి.అనిల్‌కుమార్, పి.ఉమాదేవి, కె.నాగేశ్వరరావు, బీవీ కృష్ణమూర్తి, కేఎస్ఎం స్వర్ణకుమారి, కోడి సతీష్, రాజు, సీహెచ్ సుబ్బారావు, వేంద్ర మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల అందజేత

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడు మండల పరిషత్ జూనియర్ బేసిక్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఐడీ కార్డులు అందజేశారు. దాత వల్లిపల్లి సతీష్ ఆర్థిక సాయంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గెడ్డం విజయకుమార్ రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఫొటోలతో కూడిన ఐడీ కార్డులను వారికి అందజేశారు. దాతల సాయంతో విద్యార్థులకు టై, బెల్టులు కూడా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ ఇందు గుమిల్లి మౌనిక, పల్లి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్‌కు ఘన సత్కారం

నిడదవోలు: స్థానిక గణేశ్ చౌక్ సెంటర్లో నిర్వహిస్తున్న పూజా గణపతి కుమారస్వామి వారి గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గజమాల, పుష్పగుచ్ఛం, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతకు ముందు మంత్రి దుర్గేష్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, ముప్పనబోయిన గంగారావు, లక్కంసాని సూర్యరావు, దుళ్ల మురళి, జనసేన పట్టణశాఖ అధ్యక్షుడు రంగా రమేష్, పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హైస్కూళ్లలో నర్సరీల ఏర్పాటుకు చర్యలు

ఉండ్రాజవరం: ఉపాధి హామీ పథకం కింద మండలంలోని మూడు ఉన్నత పాఠశాలల్లో నర్సరీలు ఏర్పాటు చేస్తున్నట్టు అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి (ఏపీవో) సత్యనారాయణ చెప్పారు. తాడిపర్రు, సత్యవాడ, వేలివెన్ను ఉన్నత పాఠశాలల్లో నర్సరీల ఏర్పాటుకు అనువైన స్థలాలను శనివారం ఆయన పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నర్సరీల్లో పెంచిన మొక్కలను గ్రామ ప్రజలకు పంపిణీ చేస్తామని చెప్పారు.

ఎస్ఈబీ రద్దుపై హర్షం

నిడదవోలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ప్రభుత్వం రద్దు చేయడంపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆఫీసు వద్ద సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిడదవోలు ఎక్సైజ్ సీఐ కె. రామబ్రహ్మం మాట్లాడుతూ అక్రమ మద్యం, సారా, గంజాయి అమ్మకం, రవాణాను అరి కట్టాలని సిబ్బందికి సూచించారు.